సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 20 । సెప్టెంబర్ । 2024



మెలకువలే ముఖ్యం

బొప్పాయి పంటకు వైరస్ తెగుళ్లు ఆశించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. 8లో▸



బస్సులు నడపండి

ఆర్టీసీ బస్సులు నడిపించాలని డిమాండ్ చేస్తూ షాద్‌నగర్ బస్టాండ్ ఎదుట ధర్నా నిర్వహించారు. 8లో▸



క్షుద్ర పూజలు

గుర్తు తెలియని వ్యక్తులు ఓ రైతు పంట పొలంలో క్షుద్రపూజలు చేశారు. ఈ ఘటన అంతారంలో చోటు చేసుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

విద్యుత్ లైన్ పనులు నిలిపివేయండి

కలెక్టర్ శశాంకకు పోమాల్‌పల్లి గ్రామస్తుల వినతి



కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కేశంపేట: మండల పరిధిలోని పోమాల్‌పల్లిలో హైటెన్షన్(765 కేవీ) విద్యుత్ లైన్ పనులను నిలిపివేయాలని గురువారం గ్రామస్తులు కలెక్టర్ శశాంకను కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మహేశ్వరం నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌కు హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటుకు గతంలో మార్కింగ్ ఇచ్చారని.. ఈ మార్కింగ్‌ను మార్చుతూ.. గ్రామ సమీపంలోని ఇళ్లకు వంద మీటర్ల దూరం నుంచే వేడయంతో గ్రామంలోని పురాతన దేవాలయానికి అడ్డుగా ఉంటున్నాయన్నారు. ఇదే విషయమై పవర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ వారికి సైతం వినతిపత్రం అందజేశామన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మాజీ సర్పంచ్ కృష్ణయ్య, రమేష్, భూపాల్‌రెడ్డి, అంజయ్య, ముత్యాల్‌రెడ్డి, శ్రీనివాసులు, పూజారి రవిశర్మ, నర్సింలు, మస్తాన్, రాఘవేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని అపాయింట్‌మెంట్ ఇప్పించండి

బండి సంజయ్‌ని కోరిన కొలన్ శంకర్‌రెడ్డి



శంకర్‌రెడ్డిని సన్మానిస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

బడంగ్‌పేట్: బాలాపూర్ సింగిల్ విండో మాజీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, ప్రసిద్ధి గాంచిన బాలాపూర్ లడ్డూను కైవసం చేసుకున్న కొలన్ శంకర్‌రెడ్డి గురువారం కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్‌ని కలిశారు. బాలాపూర్ లడ్డూను దక్కించుకున్న శంకర్‌రెడ్డిని బండి సంజయ్ శాలువతో సన్మానించి అభినందించారు. రూ.30.1 లక్షలతో బాలాపూర్ లడ్డూను ప్రధాని మోదీకి ఇస్తానని ప్రజలకు చెప్పానని ఇందుకు మోదీ అపాయింట్‌మెంట్ ఇప్పించేలా చూడాలని శంకర్‌రెడ్డి బండి సంజయ్‌ని కోరారు. నాలుగు రోజుల్లో కల్పించేలా ఏర్పాట్లు చేస్తానని శంకర్‌రెడ్డికి బండి సంజయ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బాలాపూర్ నాయకులు ఉన్నారు.

విశ్వకర్మలకు కేంద్రం ప్రత్యేక పథకాలు

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



విశ్వకర్మ మహాయజ్ఞంలో పాల్గొన్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

మొయినాబాద్: విశ్వకర్మలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో విశ్వకర్మ మహాయజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ.. విశ్వకర్మల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వారికి ప్రధాని మోదీ ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్ విశ్వకర్మ మహాయజ్ఞంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, విశ్వకర్మ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహాచారి, ప్రచార కార్యదర్శి శ్రీనివాస్‌చారి, వెంకటేశ్‌చారి, కృష్ణాచారి, నాగభూషన్‌చారి, రాజగోపాల్‌చారి, దర్శన్‌చారి, రమేష్‌చారి, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

22, 23న ప్రవక్త జయంతి సభలు

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 22, 23వ తేదీల్లో మహ్మద్ ప్రవక్త జయంతి ఉత్సవాల్లో భాగంగా బహిరంగ సభలు నిర్వహిస్తున్నట్లు 'తామీరే మిల్లత్' అధ్యక్షుడు జియావుద్దీన్ నయ్యర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 22న ఎగ్జిబిషన్ మైదానంలో, 23న చంచల్‌గూడ జూనియర్ కాలేజ్ మైదానంలో ఈ సభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలానా ఖాలిద్ సైఫుల్లా రహ్మానీ హాజరవుతారన్నారు.



ఫ్యూచర్‌కు 300 అడుగులు

హైదరాబాద్ అభివృద్ధికి ఫ్యూచర్ సిటీ కీలకంగా మారుతుందని విశ్వసిస్తున్న ప్రభుత్వం ఆదిశగా పనుల్లో వేగం పెంచింది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రహదారుల నిర్మాణానికి చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఆమనగల్లు వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించేందుకు కసరత్తు చేస్తోంది.

- రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు
- ఓఆర్ఆర్ నుంచి ఆమనగల్లు వరకు 40 కిలోమీటర్ల గ్రీన్ ఫీల్డ్ రహదారి



కందుకూరు: ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఓఆర్ఆర్ నుంచి నేరుగా 300 అడుగుల విస్తీర్ణంలో గ్రీన్ ఫీల్డ్ రహదారి చేపట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందులో భాగంగా ఇప్పటికే అధికారులు రెవెన్యూ వారీగా సర్వే పనులు పూర్తి చేసినట్లు సమాచారం. దీంతో ఈ ప్రాంతానికి కనెక్టివిటీ మరింత పెరుగనుంది.

టీజీఐఐసీ, అటవీ భూముల మీదుగా..

కందుకూరు మండలం బేగరికంచె, మీర్‌ఖాన్‌పేట, పంజగూడ, ముచ్చర్ల, యాచారం మండలం కురిమిద్ద, మేడిపల్లి తదితర గ్రామాల్లో గత ప్రభుత్వం ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో ప్రస్తుత ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మించేందుకు యోచిస్తున్న విషయం విదితమే. కాగా ప్రస్తుతం ఓఆర్ఆర్ కొంగరకలాన్ ఎగ్జిట్ నంబర్–13 నుంచి నేరుగా బేగరికంచె పంచాయతీ వావిళ్లకుంటతండా వరకు.. అక్కడి నుంచి ఆమనగల్లు వరకు దాదాపుగా 40 కిలోమీటర్ల మేర 300 అడుగుల విస్తీర్ణంలో రహదారి నిర్మాణం చేపట్టనుంది. ఇందుకు సంబంధించి ఇటీవల సర్వే పనులు దాదాపు కొలిక్కి వచ్చినట్లు సమాచారం. మూడు విధాలుగా సర్వే చేసిన అధికారులు చివరకు 300 అడుగుల విస్తీర్ణం రహదారికి ఓకే చెప్పినట్లు తెలిసింది. ఈ రహదారి నిర్మాణానికి దాదాపుగా 900 ఎకరాలకు పైగా భూసేకరణ చేపట్టాల్సి ఉంది. కొంగర, పిరోజ్‌గూడ, లేమూరు, తిమ్మాపూర్, రాచులూరు, గుమ్మడవెల్లి, పంజగూడ, మీర్‌ఖాన్‌పేట, ముచ్చర్ల, కుర్మిద్ద, కడ్తాల్, ముద్విన్, ఆకుతోటపల్లి, ఆమనగల్లు రెవెన్యూలో దాదాపుగా 900 ఎకరాలకు పైగా భూమిని సేకరించనున్నారు. వాటిలో టీజీఐఐసీ భూములు, మధ్యలో అటవీ భూములున్నాయి.

ఫ్యూచర్ సిటీకి నేరుగా..

కొంగర కలాన్ ఎగ్జిట్ నంబర్–13 నుంచి జిల్లా కలెక్టరేట్ కార్యాలయ రహదారిని కలుపుకొంటూ అగర్మియాగూడకు తూర్పుగా రోడ్డు ప్రారంభమవుతుంది. లేమూరు రెవెన్యూ నుంచి రాచులూరు హనుమాన్ దేవాలయం మీదుగా గాజులబురుజుతండాకు పడమర నుంచి గుమ్మడవెల్లి అటవీ భూములకు వెళ్తుంది. అక్కడ నుంచి పంజగూడ, మీర్‌ఖాన్‌పేట రెవెన్యూ మీదుగా వావిళ్లకుంటతండా పెద్దమ్మ దేవాలయం వరకు నిర్మించిన ఫార్మా రహదారి వరకు 300 అడుగుల రహదారి నిర్మించనున్నారు. సార్లరావుపల్లికి తూర్పుగా కుర్మిద్ద, ముచ్చర్ల గ్రామాల మధ్యగా కడ్తాల్, ముద్విన్, ఆకుతోటపల్లి మీదుగా ఆమనగల్లు వరకు దాదాపుగా 40 కిలోమీటర్ల మేర రహదారి నిర్మించడానికి అధికారులు ప్రణాళికలు రచించి సర్వే సిద్ధం చేశారు. అధికారికంగా ప్రకటించడమే ఆలస్యం. దీంతో హైదరాబాద్‌తో పాటు అటు బెంగళూరు, ఇటు సాగర్, విజయవాడ ప్రధాన రహదారుల నుంచి ఫ్యూచర్ సిటీలోకి నేరుగా రాకపోకలు సాగించడం సులభవుతుంది.

యుద్ధ ప్రాతిపదికన కేఎల్ఐ

- 15 రోజుల్లో డీ–82 కాల్వ ద్వారా సాగునీరు
- దసరాలోగా భూ పరిహారం
- ట్రిపుల్‌ఆర్ నిర్మాణంపై ముఖ్యమంత్రిని కలుస్తా
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



దొడ్లపహాడ్ సమీపంలో కొనసాగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మండల పరిధిలోని సింగంపల్లి గ్రామ సమీపంలో డీ–82 కాల్వ నిర్మాణంలో భాగంగా చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో 15 రోజుల్లో మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ–82 కాల్వ నుంచి మాడ్గుల వరకు కృష్ణా సాగునీరు అందిస్తామని ప్రకటించారు. కాల్వ నిర్మాణానికి రోడ్డు, మిషన్ భగీరథ పథకంలో నిర్మించిన తాగునీటి పైప్‌లైన్ అడ్డుగా ఉందని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడాలని.. పునఃనిర్మాణ ఖర్చుభరిస్తామన్నారు. గ్రామ సమీపంలో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చారని.. దీంతో తాము ఉన్నకొద్దిపాటి భూములను కోల్పోతున్నామని.. తమ భూములను కాపాడాలని పలువురు దళితులు ఎమ్మెల్యేను అభ్యర్థించారు.

ముఖ్యమంత్రి దృష్టికి రైతు సమస్యలు

అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు కేఎల్ఐ డీ–82 కాలువకు పలుచోట్ల గండ్లు పడ్డాయని వాటికి మరమ్మతు పనులు చేపట్టామన్నారు. 15 రోజుల్లో కల్వకుర్తి నుంచి వెల్దండ, ఆమనగల్లు మండలాల మీదుగా నాగిళ్ల వరకు కృష్ణా సాగునీరు అందుతుందన్నారు. డీ–82 కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోయిన పోలెపల్లి, సింగంపల్లి, అవురుపల్లి, దొడ్లపహాడ్ తదితర గ్రామాల రైతులకు దసరాలోపే భూ పరిహారం అందజేస్తామన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో దళిత రైతుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఎస్ఈ ఏఎస్ఎన్‌రెడ్డి, ఈఈ శ్రీకాంత్, డీఈఈ దేవానంద్, ఏఈ రాఘవేందర్‌రెడ్డి, పీఎం వెంకట్రావ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, నాయకులు నర్సింహ, పోచాలు, పబ్బతి శ్రీనయ్య, శ్రీశైలం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అక్విడెక్ట్ పనులు త్వరగా పూర్తిచేయాలి

మాడ్గుల: మాడ్గుల మండలం దొడ్లపహాడ్ గ్రామ సమీపంలో నిర్మిస్తున్న డీ–82 కాల్వ నిర్మాణ పనులను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. కాలువ నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న అక్విడెక్ట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు యాదయ్య, జగ్‌పాల్‌రెడ్డి, హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సింగంపల్లి సమీపంలో అధికారులతో మాట్లాడుతున్న కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి

ప్రకృతి సంరక్షకులను తీర్చిదిద్దాలి

పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సైతం భాగస్వాములు అవ్వాలని పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్–తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'స్కూల్ ఎర్త్ క్లబ్ యంగ్ లీడర్స్' మూడవ బ్యాచ్ ఓరియెంటేషన్ గురువారం ప్రారంభమైంది. ఈ శిక్షణ కార్యక్రమానికి కరీంనగర్, నల్గొండ, కామారెడ్డి జిల్లాలకు చెందిన 60 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ చైర్‌పర్సన్ లీలాలక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సాయి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన పెంచి ప్రకృతి సంరక్షకులుగా తీర్చిదిద్దాలని సూచించారు. నేల వ్యవసాయం, ప్రకృతి మధ్య అవినాభావ సంబంధాన్ని వివరిస్తూ.. విద్యార్థులకు వ్యవసాయ పరిజ్ఞానం పెంచాలన్నారు. కాలుష్య నియంత్రణకు బయో ఇంధనాల వాడకం, వృక్ష సంరక్షణ, నేల, జల సంరక్షణ, తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అధికారి అనుదీప్, ప్రోగ్రాం ఆఫీసర్స్ నగేష్, రజనీకాంత్ సీజీఆర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'గాంధీ'లో 25 డెంగీ కేసులు



గాంధీ ఓపీ విభాగంలో రోగుల రద్దీ

గాంధీఆస్పత్రి: మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో గడిచిన వారం రోజుల్లో 25 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గత ఏడు రోజుల్లో గాంధీ ఆస్పత్రి అవుట్ పేషెంట్ విభాగంలో 312 , ఇన్‌పేషెంట్ విభాగంలో 131 మొత్తం 443 ఫీవర్ కేసులు నమోదు కాగా, మెరుగైన వైద్య సేవలు అందించడంతో బాధితులు కోలుకుంటున్నారు. జ్వర లక్షణాలైన జలుబు, దగ్గు, కీళ్లనొప్పులు తదితర సమస్యలతో బాధపడుతున్న మరో 106 మందికి వైద్యసేవలు అందించినట్లు ఆస్పత్రివర్గాలు తెలిపాయి. గాంధీఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్ స్పష్టం చేశారు.

వైరల్.. వైరల్!

నగరంలో ఎక్కడ చూసినా జ్వరాలే

సాక్షి, సిటీబ్యూరో/నల్లకుంట/వనస్థలిపురం: వైరల్ ఫీవర్.. వైరల్ ఫీవర్.. ఎవరిని పలకరించినా ఇదే మాట చెబుతున్నారు. తీవ్ర జ్వరం..ఒళ్లు నొప్పులు..తల నొప్పితో పాటు జలుబు వంటి లక్షణాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ ఆస్పత్రి చూసినా జ్వరాల బారిన పడిన రోగులతో కిటకిటలాడుతోంది. వైరల్ జ్వరాలతో పాటు టైఫాయిడ్, మలేరియా, చికున్ గున్యా, డెంగీ వంటి జ్వరాలు కూడా ప్రబలుతున్నాయి. ఫీవర్ సర్వే చేస్తున్నామంటూ అధికారులు ఊదరగొడుతున్నా.. క్షేత్రస్థాయిలో అలాంటి సర్వే చేస్తున్న జాడే కనిపించట్లేదు. నామమాత్రంగా అక్కడో క్యాంపు.. ఇక్కడో క్యాంపు పెట్టి మమ అనిపించేస్తున్నారు. ఇక, వైద్యాధికారులను గట్టిగా అడిగితే మాత్రం..ఈ సీజన్‌లో జ్వరాలు కామన్ అంటూ సమాధానం దాటేస్తున్నారు. గత రెండు నెలలుగా నగరంలో పరిస్థితి ఇలాగే ఉన్నా అధికార యంత్రాంగం నుంచి ఎలాంటి చర్యలు కనిపించట్లేదు.

దోమల బెడద పట్టదా..?

నగరవ్యాప్తంగా దోమల బెడద తీవ్రమైంది. బస్తీలు, కాలనీల్లో దోమలు స్వైర విహారం చేస్తున్నా పట్టించుకున్న నాథుడే కనిపించట్లేదు. దోమల వ్యాప్తి ద్వారా ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా, చికున్ గున్యా వంటి జ్వరాలు వస్తున్నాయి. ఎప్పుడో ఒకసారి అలా వచ్చి దోమల పొగ స్ప్రే చేసి వెళ్తున్నా, దోమలను పూర్తి స్థాయిలో నివారించే చర్యలేవీ కనిపించట్లేదు. దీంతో అనేక మంది జ్వరాల బారిన పడుతున్నారు.

ఫీవర్‌కు పెరుగుతున్న తాకిడి

అపరిశుభ్ర వాతావరణం, గతంలో కురిసిన వర్షాల ప్రభావంతో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. టైఫాయిడ్, డెంగీ, డయేరియా, వైరల్ ఫీవర్లతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. రక్త పరీక్షల్లో మాత్రం అధికంగా వైరల్ ఫీవర్ కేసులే తేలుతున్నాయి. ఓపీతో పాటు ఇన్‌పేషంట్లుగా చేరే వారి సంఖ్య కూడా ఇటీవల పెరిగింది. ఇక, నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి జ్వరాల బాధితులతో కిక్కిరిస్తోంది. ఆస్పత్రికి వస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ ప్రతిరోజు 900కు పైగా ఓపీ నమోదవుతోంది. రోజుకు 20 నుంచి 45 మంది వరకు ఇన్‌పేషంట్లుగా చేరుతున్నారు. దీంతో మెడికల్ వార్డులు రోగులతో నిండిపోతున్నాయి. గతంలో 400 నుంచి 600 వరకు ఉన్న ఓపీ ఇప్పుడు 945కు చేరింది. అలాగే ఆయా ప్రాంతాల్లోని బస్తీలు, కాలనీల్లోని యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానల్లో వైద్యం కోసం ఆశ్రయిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. ప్రైవేటు క్లినిక్‌లు, ఆస్పత్రులకు వెళ్లి అడ్మిషన్ పొందుతున్న వారు కూడా ఎక్కువే ఉన్నారు.

పిల్లలపై ప్రభావం అధికమే..

వర్షాలు, వరదల అనంతరం విష జ్వరాల బాధితుల్లో చిన్నారులే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. బాధితుల్లో సుమారు 40 శాతం మంది పదేళ్ల లోపు చిన్నారులే ఉన్నారని చెబుతున్నారు. ఉన్నట్టుండి శరీరం వేడెక్కడం, నీరసం, చలి, గొంతునొప్పి వంటి లక్షణాలతో ఇబ్బంది పడుతున్నారు.

పారిశుద్ధ్య లోపమే కారణం!

నగరంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారడం.. మంచి నీరు కూడా కలుషితం కావడం వల్ల టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రబలుతున్నాయి. వీటి నివారణకు వైద్య, ఆరోగ్య, సంబంధిత అధికారులు సరైన ముందస్తు చర్యలు తీసుకోలేదని ప్రజలు వాపోతున్నారు. దోమలు విజృంభిస్తున్న కారణంగా సీజనల్ వ్యాధులతో బాధపడే వారికి రక్త పరీక్షల్లో నార్మల్ వస్తున్నా.. జ్వ రం, దగ్గు, నీరసం, జలుబు వంటి లక్షణాలతో బాధపడే వారు పెరిగినట్టు వైద్యులు చెబుతున్నారు.

వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో..

వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఓపీ కౌంటర్ వద్ద, వైద్య పరీక్షల కోసం, మందుల కోసం క్యూలైన్లలో నిల్చుంటున్నారు. గర్భిణులు, పిల్లలు, కుక్కకాటు బాధితులు, విష జ్వరాల బారిన పడిన వారి కోసం ప్రత్యేకంగా ఓపీలు ఏర్పాటు చేశారు. విష జ్వరాల బారినపడినవారే అధికంగా వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. గతంలో రోజుకు 500 నుంచి 600 మంది వచ్చే వారని, ప్రస్తుతం వెయ్యి నుంచి 1,100 మంది రోగులు వస్తున్నారని పేర్కొంటున్నారు.

ఏ ఆస్పత్రి చూసినా రోగులతో కిటకిట..

- చాపకింద నీరులా పాకుతున్న విష జ్వరాలు
- అధికమవుతున్న చికున్ గున్యా, టైఫాయిడ్, డెంగీ, మలేరియా
- దోమల స్వైర విహారం, పారిశుద్ధ్యలోపంతో రోగాలు

గత పది రోజుల్లో ఫీవర్‌లో నమోదైన ఓపీ, ఐపీ కేసుల వివరాలు

తేదీ	ఔట్ పేషంట్లు (ఓపీ)	ఇన్ పేషంట్లు (ఐపీ)
10న	829	31
11న	836	28
12న	942	28
13న	936	23
14న	879	31
15న	382	04
16న	941	35
17న	594	17
18న	816	45



పెరిగిన జ్వర కేసులు

ఈ నెల 1 నుంచి 18 వరకు మొత్తం 13,287 ఓపీ నమోదు కాగా, 10 నుంచి 18 వరకు 242 ఐపీ కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా ఇటీవల జ్వరాల కేసులు పెరిగాయి. ఇక, మరో 867 కుక్క కాటు కేసులు ఉన్నాయి.

– డాక్టర్ జయలక్ష్మి, ఫీవర్ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్

అన్ని మందులున్నాయి

ఆస్పత్రిలో ప్రస్తుతం డెంగీ కేసులు మూడు నమోదయ్యాయి. వారికి ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నాం. కుక్కకాటు బాధితులు కూడా రోజూ పదుల సంఖ్యలో వస్తున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన వైద్య సిబ్బంది ఉన్నారు.

– డా.ఎస్.కృష్ణ, సూపరింటెండెంట్

సకాలంలో బస్సులు నడపండి



రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు



విద్యార్థి సంఘాల నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

షాద్‌నగర్ బస్టాండ్ ఎదుట విద్యార్థుల ధర్నా

షాద్‌నగర్: గ్రామాలకు సకాలంలో ఆర్టీసీ బస్సులు నడిపించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో గురువారం షాద్‌నగర్ బస్టాండ్ ఎదుట ధర్నా నిర్వహించారు. విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఆర్టీసీ అధికారులు గ్రామాలకు సరైన సమయానికి బస్సులు నడిపించడం లేదన్నారు. దీంతో విద్యార్థులు సమయానికి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సకాలంలో బస్సులు నడిపించాలని ఇప్పటికే పలుమార్లు ఆర్టీసీ డీఎంకు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదని, దీంతో ధర్నా చేపడుతున్నామన్నారు. గ్రామాల నుంచి నిత్యం వేలాది మంది విద్యార్థులు, ప్రజలు వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వస్తుంటారన్నారు. బస్సులు సరైన వేళలకు నడిపించకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి సరైన సమయానికి బస్సులు నడిపించాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులు ధర్నా చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని సముదాయించారు. విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కాసేపటికే విడుదల చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు శివ, విజయ్‌చారి, శివశంకర్, ధర్మారెడ్డి, అమీర్, సిద్ధు, శ్రావణి, అఖిల, స్వాతి, మానస, లహరి, సాత్విక, షాలిని పాల్గొన్నారు.

అకాడమిక్ వెయిటేజ్ మార్కులు కలపాలి

తెలంగాణ నర్సింగ్ సమితి నేతల డిమాండ్

కవాడిగూడ: మెడికల్ హెల్త్ స్టేట్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఇటీవల విడుదల చేసిన నర్సింగ్ ఆఫీసర్స్ నోటిఫికేషన్‌లో నాన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ అభ్యర్థులకు అకాడమిక్ వెయిటేజ్‌ని ప్రతి సంవత్సరానికి ఒక మార్కు చొప్పును గరిష్టంగా 10 మార్కులను కలపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తెలంగాణ నర్సింగ్‌సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు గోవర్ధన్, వెంకి నాని మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అకాడమిక్ వెయిటేజ్ మార్కులను ఇచ్చేవారని, 2008 నుంచి వస్తున్న నోటిఫికేషన్లలో వెయిటేజ్ మార్కులను తొలగించారని, దీనితో ప్రైవేటు సెక్టార్‌లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న సీనియర్ నర్సింగ్ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ కష్ట సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలు అందించామని, నాన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నర్సింగ్ అభ్యర్థుల సేవలు దృష్టిలో పెట్టుకుని అకాడమిక్ వెయిటేజ్ మార్కులను కలపాలని కోరారు. నర్సింగ్ అభ్యర్థుల పరీక్షను మూడు షిఫ్టలకు కాకుండా ఒకే షిఫ్ట్‌లో నిర్వహించి మినిమం క్వాలిఫయింగ్ మార్క్‌లను నిర్ణయించాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో శ్యామ్, లక్ష్మి, ప్రశాంత్ ఉన్నారు.

ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

యాచారం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని యాచారం పోలీసులు పట్టుకున్నారు. కడ్తాల్ మండల పరిధిలోని పల్లెచల్కతండాకు చెందిన ఇస్లావత్ రమేష్ గురువారం మధ్యాహ్నం గునుగల్ గేట్ నుంచి యాచారం వైపు మారుతీ వ్యాన్‌లో ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడు. సమాచారం మేర కు గునుగల్ గేట్ వద్ద పోలీసులు మారుతీ వ్యాన్‌ను తనిఖీ చేసి రేషన్ బియ్యాన్ని పట్టుకుని ఠాణాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు బస్సుల్లో సెల్‌ఫోన్ల చోరీ

చేవెళ్ల: వేర్వేరు బస్సుల్లో ప్రయాణం చేస్తున్న ప్రయాణికుల వద్ద నుంచి సెల్‌ఫోన్‌లు చోరీకి గురైన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల బస్‌స్టేషన్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న తాండూరు డిపో బస్‌లో ఉపాధ్యాయుడు జనార్దన్‌రెడ్డి జేబులో నుంచి సెల్‌ఫోన్ చోరీకి గురైంది. మరోఘటనలో చేవెళ్ల నుంచి పరిగి వైపు వెళ్తున్న బస్సులో షాదన్‌గర్‌కు చెందిన వెంకటేశ్ తన ఫ్యామిలీతో వెళ్తుండగా సెల్‌ఫోన్‌ని అపహరించారు. ఇరువురి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శంషాబాద్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణంలోని కొత్వాల్‌గూడలోని హిమాయత్‌సాగర్ చెరువు ఒడ్డున నీళ్లలో మృతదేహం (40) తేలియాడుతుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి ఒంటిపై నలుపు రంగు ప్యాంటు, నలుపు రంగు టీషర్టు ఉన్నాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బొప్పాయిలో మెలకువలే ముఖ్యం

- అన్నదాతలను వేధిస్తున్న వెర్రి తెగుళ్లు
- యాజమాన్య పద్ధతులతోనే నివారణ
- రైతులకు క్రిడా నిపుణుడు శ్రీకృష్ణ సూచనలు



కందుకూరు: బొప్పాయి పంటకు వైరస్ తెగుళ్ల ఆశించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కనీసం పెట్టుబడులు సైతం రాని దుస్థితి దాపురిస్తుంది. తెగుళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను గురించి కృషి విజ్ఞాన్ కేంద్రం క్రిడా నిపుణుడు జి.శ్రీకృష్ణ అన్నదాతలకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సుమారు ఆరు వేలకు పైగా ఎకరాల్లో బొప్పాయిని సాగు చేస్తున్నారు. ఇందులో జిల్లాలోనే నాలుగు వేల ఎకరాల్లో పంటను పండిస్తున్నారు.

పండు నాణ్యతకు దెబ్బ

మొజాయిక్, రింగ్‌స్పాట్(ఉంగరాల) తెగులు, ఆకుముడత(క్రింకిల్) అనే మూడు రకాల వెర్రి తెగుళ్లు బొప్పాయి పంటను ఆశించి దిగుబడులను గణనీయంగా తగ్గిస్తుంది. పండు నాణ్యతను దెబ్బ తీసి నష్టాన్ని కలిగించడంతో పాటు కొన్ని సందర్భాల్లో చెట్లు కాపునకు రాకుండా చేస్తుంది. ఈ మహమ్మారిని తొలి దశ నుంచే యాజమాన్య పద్ధతులతో అరికట్టాలి. వెర్రి తెగులు వైరస్ ఒకసారి ప్రవేశిస్తే మొక్క క్షీణించే వరకు దాని జీవకణాలలోనే ఉండి రకరకాలుగా అవరోధాలను కలిగించి అనర్థాలకు దారితీస్తుంది.



వెర్రి తెగులు సోకిన బొప్పాయి మొక్క



ఆకు ముడత సోకిన బొప్పాయి

మొజాయిక్ తెగులు

మొజాయిక్ తెగులు ఆశిస్తే ఆకు సైజు తగ్గుతుంది. ఆకులపై అక్కడక్కడ పసుపు రంగు మచ్చలు ఈనెలతో నిమిత్తం లేకుండా ఏర్పడతాయి. దూరం నుంచి ఆకులు పసుపు రంగుకు మారినట్లు కన్పిస్తాయి. అందుకే దీనిని పల్లాకు తెగులని అంటారు. తెగులు సోకిన ఆకులు పెళుసుగా మారతాయి. చెట్ల పెరుగుదల తగ్గి ఎదుగుదల అంతగా ఉండదు. పంట దిగుబడి నాణ్యత గణనీయంగా తగ్గుతుంది. కాయలు గిడసబారి నాసిరకంగా ఉంటాయి. విత్తనం, పేనుబంక ద్వారా తెగులు వ్యాపిస్తుంది.

ఉంగరాల(రింగ్‌స్పాట్) తెగులు


ఈ తెగులు లక్షణాలు ఆకులు, కాడ, కాండం, పూత, పిందె, కాయ, పండ్లపై ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. లేత ఆకులు పచ్చదనం కోల్పోయి పసుపు పచ్చగా మారతాయి. ఆకుల ఈనెలు వంగి ముడుచుకుపోతాయి. దీంతో ఆకుల పరిమాణం తగ్గి సరైన మోతాదులో ఆహారాన్ని తయారు చేసుకోలేవు. కాండం పైభాగాన ఆకు తొడిమలపై ముదురాకు పచ్చని మచ్చలు, చారలు నూనె రాసినట్లు కన్పిస్తాయి. తెగులు సోకిన చెట్టు పూలు అంతగా పిందె కట్టవు. పిందెలు ఎదగవు. రింగులున్న కాయలు తొందరగా పండి మెత్తబడి నీరుకారుతాయి. నాణ్యత బాగా లోపిస్తుంది.

ఆకుముడత (లీఫ్ క్రింకిల్) తెగులు

ఈ తెగులు సోకిన చెట్లలో ఎదుగుదల తగ్గుతుంది. ఆకులు ముడుచుకుని బంతిలాగా మారతాయి. ఆకు తొడిమ వంకర టింకరగా తిరుగుతుంది. వికృతాకారంగా ఉంటుంది. చెట్టు తల ఆకారం మారుతుంది. పూత రాక గొడ్డు చెట్టుగా మారవచ్చు. తెల్లదోమ ద్వారా తెగులు వ్యాప్తి చెందుతుంది.

వెర్రి తెగులు నివారణ యాజమాన్యం

- ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలు వాడాలి.
- విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి.
- నారు మొక్కలు ప్రధాన పొలంలో నాటేటప్పుడు వెర్రి తెగుళ్ల లక్షణాలు గల వాటిని నాటరాదు.
- అంతర పంటగా మిరప, టమాటా, దోస, పుచ్చ, గుమ్మడి లాంటివి సాగుచేయరాదు.
- తెగులు సోకిన మొక్కలను గమనించిన వెంటనే తీసి నాశనం చేయాలి.
- సమతుల సమగ్రమైన ఎరువులను సకాలంలో అందించాలి.
- సూక్ష్మధాతు మిశ్రమాన్ని 3, 4 నెలల వయసులో ఒకసారి చెట్లపై పిచికారీ చేయాలి.
- కలుపు మొక్కలు పొలంలోను, పొలం గట్లపైన లేకుండా పరిశుభ్రతను పాటించాలి.
- తోటలో నీరు నిల్వకుండా జాగ్రత్త పడాలి.
- అంతర సేద్యం చేసేటప్పుడు చెట్ల వేర్లకు గాయాలు తగలకుండా చూడాలి.
- రసం పీల్చే పురుగులతోనే వైరస్ తెగుళ్ల వ్యాప్తి చెందుతాయి. పేనుబంక, తెల్లదోమ పురుగులను సకాలంలో నివారించాలి. వాటి నిర్మూలనకు థైయోమిథాక్సిన్ 0.3 గ్రా, లేదా డైఫెన్‌థ్యూరియాన్ 1 గ్రా, లేదా స్పినోస్యాడ్ 0.3 మి.లీ లేదా ఎసిఫెట్ 1.5 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. వాటితో పాటు 5 మి.లీ వేప నూనె లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- 15 రోజుల వ్యవధిలో పై మందులను రెండు, మూడు సార్లు పిచికారీ చేసుకుంటే పురుగు ఉధృతి తగ్గుతుంది.



ఉంగరాల తెగులు సోకిన బొప్పాయి కాయ

గంజాయి చాక్లెట్ల పట్టివేత

పోలీసుల అదుపులో నిందితుడు

ఇబ్రహీంపట్నం రూరల్: గుట్టు చప్పుడు కాకుండా గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని ఆదిబట్ల, మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాల సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నారనే సమాచారంతో మహేశ్వరం ఎస్‌ఓటీ, ఆదిబట్ల పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. బిహార్‌కు చెందిన సంతోష్ ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అతడు 2022లో హైదరాబాద్‌కు వచ్చాడు. అతని వద్ద 40 సాచెట్లకు పైగా గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఒక రకమైన వాసనను బట్టి గంజాయి చాక్లెట్లుగా గుర్తించినట్లు తెలిసింది. మరో 19 చాక్లెట్ ప్యాకెట్లు కూడా లభించినట్లు సమాచారం. ఇతనికి సరఫరా చేసే ముఠా గురించి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించనున్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



వినోద్‌నాయక్(ఫైల్)

కడ్తాల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి.. కడ్తాల్ మండలం పెద్దారెడ్డి చెరువుతండాకు చెందిన వర్త్యావత్ వినోద్‌నాయక్(30), మరో యువకుడితో కలిసి గత శనివారం రాత్రి ద్విచక్రవాహనంపై కడ్తాల్ వెళ్తున్నారు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. వినోద్‌కు తీవ్ర గాయాలవగా, మరో యుడకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వినోద్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు



ప్రభుత్వ భూమిలో బోర్డును ఏర్పాటు చేసిన అధికారులు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని మండల ఆర్ఐ సుజిత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని తోల్‌కట్ట రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 141లో రాత్రికి రాత్రే నిర్మించిన బేస్మెంట్ ఇళ్లను తహసీల్దార్ ఆదేశాల మేరకు కూల్చివేశారు. పోలీసుల సమక్షంలో జేసీబీతో తొలగించామని ఆర్ఐ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది భాస్కర్‌యాదవ్, మహేందర్, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల పట్టివేత

- ఎండీఎంఏ, ఎస్ఎస్‌డీ బ్లాస్ట్ స్వాధీనం
- ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థుల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

గచ్చిబౌలి: వేర్వేరు చోట్ల ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ బ్లాస్ట్‌ను స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో బుధవారం రాత్రి డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో డీఎస్పీ తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో దాడి చేసిన పోలీసులు దత్తి లతీన్, పడాల అభిరామ్, కొడాలి నాయుడులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.83 వేల విలువైన 5.7 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్ జ్యోతి, కానిస్టేబుళ్లు రాజేశ్వర్ వికాస్, శశికిరణ్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులే లక్ష్యంగా..

బీటెక్ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులను ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ అధికారులు అరెస్ట్ చేశారు. డ్రగ్స్‌కు బానిసలైన వీరు వాటిని కొనలేక డ్రగ్స్ అమ్మకాలకు పాల్పడుతున్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 37 వద్ద చెన్నైలో ఇంజనీరింగ్ చదువుతున్న చరణ్ తేజ్, కౌశిక్ తూబోటి, సయ్యద్ సర్ఫరాజ్‌లు ఎల్ఎస్‌డీ డ్రగ్స్ విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.70 వేల విలువ చేసే 30 ఎల్ఎస్‌డీ బ్లాట్స్ స్వాధీనం చేసుకున్నారు. చరణ్‌తేజ్, కౌశిక్, సర్ఫరాజ్‌ను అరెస్ట్ చేశామన్నారు. దాడుల్లో పాల్గొన్న అధికారులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి అభినందించారు.



ఎర్రకుంట చెరువు



వివాదానికి కారణమైన కాజ్ వే నిర్మాణం చేపడుతున్న ప్రాంతం ఇదే

కాజ్‌వే వివాదం

అలుగు నిర్మాణంపై ఇరువర్గాల రైతుల వాదనలు

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధి తొర్రూర్‌లోని ఎర్రకుంట చెరువు కాజ్‌వే నిర్మాణం వివాదానికి దారితీసింది. తమ పొలాలను ముంచేందుకే అధికార పార్టీ నేతల అండదండలతో అలుగును ఉన్న చోట కాకుండా మరోచోటుకు మార్చేందుకు కొందరు యత్నిస్తున్నారని తొర్రూర్‌కు చెందిన పలువురు రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తొర్రూర్‌కు చెందిన రైతులు రాములు, రాజ్‌కిరణ్, యాదయ్య, రాజు, వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రస్తుతం పనులు చేపడుతున్న ప్రాంతానికి 200 మీటర్లకు పైగా దూరంలో అలుగు ఉందని.. దీంతో చెరువు నిండితే పైభాగంలో ఉన్న వారి పొలాలు మునిగిపోతున్నాయి. త్వరలో ఆ పొలాల్లో విల్లాలు నిర్మించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ కుట్రకు తెరలేపారని ఆరోపించారు. బ్రాహ్మణపల్లి నుంచి కాల్వ ద్వారా వచ్చే నీరు రాకుండా చేసేందుకు అలుగు ప్రాంతాన్ని మారుస్తున్నారని.. దీంతో భవిష్యత్‌లో చెరువుకు వరద చేరే అవకాశం ఉండదన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు రికార్డుల ప్రకారం చెరువును పూర్తిగా సర్వే చేసి, గతంలో ఎక్కడ నుంచి అలుగు ఉందో అక్కడ నుంచే కాజ్‌వే నిర్మాణం చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఆరోపణలు అవాస్తవం

ఇదే గ్రామానికి చెందిన శ్రీను, రమేష్, మహేందర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వంగేటి భారతమ్మ, నరేందర్ మాట్లాడుతూ.. తమపై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవవ లేదని.. 2020లో వచ్చిన వరదల కారణంగా పలువురు రైతుల పొలాలు నీట మునగడంతో ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. 2022 మేలో ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి, రోడ్డు నిర్మాణ పనుల్లో అలుగు అన్యాక్రాంతం అయిందని గుర్తించి నివేదికను ఆర్‌అండ్‌బీకి సమర్పించారన్నారు. 2023లో కాజ్‌వే నిర్మాణ పనులకు టెండర్‌లు పిలవగా.. వరుసగా ఎన్నికల కోడ్‌లు రావడంతో పనులు ప్రారంభానికి నోచుకోలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే టెండర్‌లు ఖరారయ్యాయని, గ్రామానికి చెందిన రైతులను ఇబ్బంది పెట్టాలనే ఆలోచన తమకు లేదని, నిబంధనల ప్రకారం నడుచుకుంటామన్నారు.

పూల తోటలో క్షుద్ర పూజలు

భయాందోళనలో బాధిత రైతులు



పొలంలో పూజలు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న పోలీసులు

చేవెళ్ల: గుర్తు తెలియని వ్యక్తులు ఓ రైతు పంట పొలంలో క్షుద్రపూజలు చేశారు. ఈ సంఘటన చేవెళ్ల మండలంలోని అంతారంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ఆవుల అనంతయ్య చామంతి పూలు సాగు చేస్తున్నాడు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పొలంలోని పలు పూల మొక్కలను తొలగించి, క్షుద్రపూజలు చేసినట్లుగా గుర్తించాడు. ఓ ప్లేట్‌లో కుంకుమ, పసుపు కలిపిన అన్నం, పిండితో చేసిన బొమ్మ కనిపించాయి. దీంతో హడలిపోయిన బాధితుడు డయల్ 100 ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షుద్రపూజ కోసం వినియోగించిన వస్తువులను తొలగించారు. ఇలాంటి మూఢ విశ్వాసాలను నమ్మొద్దని తెలిపారు. అయితే పంట నష్టం చేయటం సరైనది కాదన్నారు. ఇదిలా ఉండగా తనకు దాయాదులకు భూవివాదం ఉందని, వారే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని అనంతయ్య ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అస్వస్థతతో ఇద్దరు ప్రయాణికుల మృతి

శంషాబాద్: విమాన ప్రయాణంలో అస్వస్థకు గురై ఇద్దరు వేర్వేరు ప్రయాణికులు మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింద. ఆర్‌జీఐ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన నితీష్ (40) గోవా వెళ్లి అక్కడి నుంచి ఈ నెల 16న ఇండిగో విమానంలో హైదరాబాద్‌కు బయలుదేరాడు. విమానంలో ఉండగానే స్పృహ కోల్పోయిన అతడికి విమాన సిబ్బంది సీఆర్‌పీ చేసినప్పటికి స్పృహాలోకి రాలేదు. సాయంత్రం 6.30 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకోగానే అతడిని అపోలో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో సంఘటనలో హైదరాబాద్ పాతబస్తీకి చెందిన షేక్‌హసీనా (70) మక్కా నుంచి తిరిగి వస్తుండగా ఈ నెల 17న తెల్లవారుజామున శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అస్వస్థతకు గురికాగా అపోలో ఆస్పత్రి చేర్పించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.